క్లుప్తంగా

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలోని అన్నివార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. పట్టణంలోని ఆయావార్డుల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను శనివారం ఆమె పరిశీలించారు. శానిటరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులతోపాటు దోమల నివారణకు అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.డ్రెయిన్లలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని వివరించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ టి.గురునాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలువేలం ద్వారా రూ.13.33లక్షల ఆదాయం

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి వారి ఆలయ భూముల కౌలువేలం శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయానికి గల 76.70ఎకరాల భూమికి కౌలువేలం పాట ద్వారా స్వామివారికి రూ.13.33లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో భూపాల్ తెలిపారు. గతేడాది కంటే ఈసారి రూ.2లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, గ్రామరైతులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం ఖమ్మం జిల్లా, ముష్టికుంట గ్రామానికి చెందిన బంధం నాగభూషణం రూ.10,116 ఆలయ అర్చకులు, అధికారులు చేతుల మీదుగా అందజేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన వీరపనేని సురేష్‌చంద్ర, లిఖిత దంపతులు నిత్యాన్నదానానికి రూ.1,016, అంకమ్మవారి ఆలయ గోపురం వెండి తాపడం తయారీకి రూ.9,216లు విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



నందిగామ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం సాయంత్రం ఈవీఎంల పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 14వ తేదీన స్థానిక కె.వి.ఆర్ కళాశాలలో పోలింగ్‌కేంద్రాలఅధికారులు, అసిస్టెంట్ పోలింగ్ కేంద్రాల అధికారులకు ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించనున్నారు. ఆర్డీవో ఏ రవీంద్రరావు మాట్లాడుతూ ఏఈ ఆర్వోలు, సెక్టార్ అధికారులకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ నిర్వహించే విధానం, ఈవీఎం మిషన్ పనిచేసే విధానంపై అధికారులకు క్షుణ్ణంగా వివరించారు. నందిగామ, కంచికచర్ల ,వీరులపాడు, చందర్లపాడు తహసిల్దార్లు వై.సరస్వతి, వి.సుస్వాగతం, కె.రాజాకిషోర్, మురళీధర్, పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



చందర్లపాడు(నందిగామ): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని చందర్లపాడు ఎస్‌ఐ ఆర్.ధర్మరాజు సూచించారు. మండలంలోని మునగాలపల్లిలో శనివారం రాత్రి పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఓటుహక్కు వినియోగించుకునేలా చూడడమే పోలీసు కవాతు నిర్వహణ లక్ష్యమని వివరించారు.

పైపులైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రజలకు మంచినీటిని అందించే ప్రధాన పైపులైన్‌కు కోదాడ రోడ్‌లో బజాజ్ షూరూం సమీపంలో లీకేజీ ఏర్పడింది. దీంతో పట్టణంలోని సీతారామపురం, కాకానినగర్, డాంగేనగర్, ఎన్జీవోస్ కాలనీ తదితర ప్రాంతాలకు శనివారం నీటిసరఫరా నిలిచిపోయింది. మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది వెంటనే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. అప్పటి వరకు ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు.

అభివృద్ధికి కేరాఫ్ తిరుమలగిరి

- ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు
- రూ.17.89 కోట్లతో తిరుమలగిరి అభివృద్ధి
- ఆలయాభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- గ్రామంలో మెరుగుపడిన వసతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తిరుమలగిరి గ్రామం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. అధ్యాత్మిక్షేత్రం తిరుమలగిరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి గ్రామస్తులు, భక్తుల కోసం ఎన్నో వసతులు కల్పించారు. శ్రీవాల్మీకోద్భవ వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన తిరుమలగిరి అభివృద్ధికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రత్యేకంగా దృష్టి సారించి అభివృద్ధిపథంలో నడిపించారు.

ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు..

తిరుమలగిరిలో 480 కుటుంబాలు ఉండగా 1575మంది జనాభా ఉన్నారు. 1120మంది ఓటర్లు ఉన్నారు. తిరుమలగిరి గ్రామం గతంలో చిల్లకల్లు మేజర్ గ్రామపంచాయితీ శివారు గ్రామంగా ఉండేంది. ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని దశాబ్దకాలంగా గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో అందుకు కృషి చేస్తానని 2019 ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే సామినేని ఉదయభాను హామీ ఇచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత 2020 జనవరి నెలలో తిరుమలగిరిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైంది. ఎన్నికల హామీని నెరవేర్చడంతో పాటు గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేకంగా దృష్టిసారించి ఆధ్యాత్మిక గ్రామాన్ని అభివృద్ధిలోనూ ముందంజలో ఉంచారు.

రూ.43లక్షలతో సచివాలయం..

గ్రామంలో రూ.43లక్షలతో సచివాలయాన్ని నిర్మించారు. రూ.20లక్షలతో రైతుభరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. రూ.20లక్షలతో సిమెంటురోడ్ల



తిరుమలగిరిలో నిర్మించిన సచివాలయం

నిర్మాణంతోపాటు డ్రైనేజీలు నిర్మించారు. రూ.5లక్షలతో గ్రామంలోని ఎస్సీకాలనీలో వాటర్‌ట్యాంక్ నిర్మాణం చేపట్టారు.

మారిన పాఠశాల రూపురేఖలు..

తిరుమలగిరిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మనబడి నాడు-నేడు పథకం కింద రూ.20లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించారు. విద్యార్థులకు డెస్కులతో కూడిన బల్లలు ఏర్పాటు చేశారు. రూ.16లక్షలతో ఎస్సీకాలనీలో నూతన అంగన్‌వాడీ భవనం నిర్మించారు.

రూ.2కోట్లతో తారురోడ్ల నిర్మాణం..

చిల్లకల్లు నుంచి తిరుమలగిరికి వెళ్లేందుకు ఎన్నెస్పీ కాలువ వరకు రూ.1కోటితో బీటీరోడ్డు నిర్మించారు. అదేవిధంగా తిరుమలగిరి నుంచి గోపినేనిపాలెం వెళ్లేందుకు మరో రూ.1కోటితో బీటీ రోడ్డును నిర్మించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రైతుభరోసా కేంద్రం

నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ 58నెలల పాలనలో గ్రామంలో రూ.3.94కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి గ్రామంలో మౌలికవసతులు మెరుగుపరిచారు.

రూ.70లక్షలతో గిరిప్రదక్షిణ ఏర్పాట్లు..

గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గిరిప్రదక్షిణ కోసం రూ.70లక్షలతో ఏర్పాట్లు చేశారు. భక్తులు గిరిప్రదక్షిణ చేసేలా ఈ నిధులతో సిమెంటురోడ్డు నిర్మాణం చేశారు.

డీబీటీ ద్వారా రూ.13.95కోట్ల లబ్ధి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన ఆయా ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామంలోని అర్హులైన పేదలందరికీ లబ్ధిచేకూరింది. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యాదీవెన, రైతుభరోసా తదితర పథకాల ద్వారా తిరుమల గ్రామస్తుల బ్యాంకు ఖాతాలోకి డీబీటీ రూపంలో ప్రభుత్వం నేరుగా రూ.13.95కోట్లను జమచేసింది.

150మందికి ఇళ్లస్థలాలు..

ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని నవరత్నాలు-పేదలందరికి ఇళ్ల పథకం కింద గ్రామంలో ఇళ్లులేని 150మంది పేదలకు ఇళ్ల



గిరిప్రదక్షిణ కోసం ఆలయం చుట్టూ రూ.70లక్షలతో ఏర్పాటు చేసిన రోడ్డు



రూ.కోటితో నిర్మించిన చిల్లకల్లు-తిరుమలగిరి బీటీ రోడ్డు



ఎస్సీకాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

స్థలాలు పంపిణీ చేశారు. అంతేగాకుండా ఇళ్ల నిర్మాణం కోసం కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థికసాయం అందించింది. ఇలా తిరుమలగిరి గ్రామం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంతో అభివృద్ధి చెందడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఎంతో అభివృద్ధి..



ఈ ఐదేళ్లలో మా తిరుమలగిరి గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. సచివాలయం, రైతుభరోసా కేంద్రాల నిర్మాణంతోపాటు పాఠశాలలను అభివృద్ధి చేశారు. గ్రామాభివృద్ధికి కృషిచేసిన ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు రుణపడి ఉంటాం.

-జాగు రాము, గ్రామస్తుడు

పథకాల ద్వారా లబ్ధి..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన పథకాలతో గ్రామంలో ప్రతి ఇంటికి మేలు చేకూరింది. మహిళా సంక్షేమానికి ఈ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. ఆయా పథకాల ద్వారా కోట్ల రూపాయలు గ్రామస్తులకు అందాయి.

-లింగిశెట్టి లక్ష్మి, గ్రామస్తురాలు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలని జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు, నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో గాలి, వెలుతురు తదితర మౌలికవసతులపై ఆరా తీశారు. అంతకుముందు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా అంశాలపై సీఐ జానకీరామ్, ఏఈఆర్వో, తహసీల్దార్ శేషగిరి తదితర అధికారులతో వారు సమీక్ష సమావేశం నిర్వహించారు.

అమ్రితసాయి విద్యార్థుల రక్తదానం



పరిటాల(కంచికచర్ల) : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు, కళాశాల సిబ్బంది కలిసి 102 యూనిట్ల రక్తాన్ని దానం చేశారంటూ వారిని అభినందించారు. విజయవాడ ఆంధ్ర ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు ప్రతి మూడునెలలకొకసారి రక్తదానం చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి. శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు, వైద్యసిబ్బంది, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ ప్రజలకు రుణపడి ఉంటా



ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు స్వాగతం పలుకుతున్న సిద్దార్థనగర్ వాసులు



ఎమ్మెల్యేను ఆత్మీయంగా సత్కరించిన ఓటర్లు



తనను గెలిపించాలని ఓటర్లను కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా అనుక్షణం ప్రజలతోనే ఉన్నానని.. భవిష్యత్‌లో కూడా ప్రజలతో కలిసి నడుస్తానని నందిగామ ఎమ్మెల్యే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. తాము రాజకీయాల్లోకి వచ్చిన నాటినుంచి తమను ఆదరించి అక్కున చేర్చుకుంటున్న నందిగామ నియోజకవర్గ ప్రజలకు సదా రుణపడి ఉంటామని చెప్పారు. నందిగామ పట్టణంలోని ఏడో వార్డు సిద్ధార్థనగర్, బస్టాండ్ వెనక వైపు ప్రాంతాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావుకు మహిళలు హారతులిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు. తొలుత ఆయా వార్డులోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎస్సీకాలనీ, పాత ఎస్సీకాలనీ వాసుల ఆత్మగౌరవాన్ని నిలిపేలా కాలనీకి సిద్దార్థ నగర్ అని నామకరణం చేసి, కాలనీ అభివృద్ధికి కృషిచేసినట్లు తెలిపారు. కనీసవసతులకు నోచుకోని కాలనీలు సైతం నేడు అన్నివసతులతో దర్శనమిస్తున్నాయని వివరించారు. పార్టీలు, రాజకీయాలు చూడకుండా తన దగ్గరికి వచ్చిన ప్రతిఒక్కరికి నేను చేయగలిగిన మంచి చేశానని వివరించారు. రానున్న ఎన్నికలలో తనకు అండగా నిలిచి మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి మాడుగుల మనోహర్, నాయకులు బెజవాడ రాజశేఖర్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, సూరె రామారావు, మన్నెం దాసు, షేక్ ఫాతిమా, పిల్లి జయరాజు, షేక్ యాకుబ్ అలీ, అచ్చి శ్రీకర్, కౌన్సిల్ సభ్యుడు షేక్ యాకుబ్ అలీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా మేళా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని బాపు మ్యూజియంలో చేనేత, హస్తకళా ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభించినట్లు మేళా నిర్వాహకులు తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి నేరుగా ఉత్పత్తిదారులు తాము తయారు చేసిన నాణ్యమైన వస్త్రాలు విక్రయిస్తారన్నారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, మంగళగిరి చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బెంగాలీ కాటన్, శారీస్, జైపూర్ బెడ్ షీట్స్, ఖాదీ వస్త్రాలు, పొందూరు ఖద్దరు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్క బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, 1 గ్రామ్ జ్యూయలరీ, పూజా వస్తువులు, లెదర్ బ్యాగులు మొదలైన వస్తువులు అమ్మకానికి ఉన్నాయని నిర్వాహకురాలు పద్మజ తెలిపారు. ఈ ప్రదర్శనను వాణీమోహన్ ప్రారంభించి వస్త్రాలను తిలకించారన్నారు.

ఇరువురు మద్యం విక్రేతల అరెస్ట్

తిరువూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురు మహిళలను తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శనివారం అరెస్టు చేశారు. తిరువూరు బోయకాలనీలో నల్లబోతుల స్వాతి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకుని దాడి నిర్వహించగా 23 సీసాలు లభ్యమయ్యాయి. ఎ.కొండూరు మండలం పాల్తియా తండాలో అజ్మీరా చిన్ని వద్ద 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. ఇరువురిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ

కంచికచర్ల : మండలంలోని అన్ని గ్రామాలోని సచివాలయాల వద్ద శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందజేశారు. కంచికచర్ల గ్రామ సచివాలయం-1 పరిధిలో మిగిలిన 40మందికి పింఛన్లు అందజేశామని వెల్ఫేర్ అసిస్టెంట్ అజయ్ తెలిపారు. గొట్టుముక్కల, పరిటాల, గండేపల్లి, కీసర, పెండ్యాల, చెవిటికల్లు, మోగులూరు, తదితర గ్రామాల్లోనూ సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. వలంటీర్ల వ్యవస్థ ఉంటే ప్రతినెలా ఒకటోతేదీ పొద్దుపొడవకముందే అందే పింఛన్, టీడీపీ నాయకుల దుశ్చర్యల కారణంగా ఈసారి ఆరురోజులు ఆలస్యంగా అందిందని పింఛన్‌దారులు విమర్శిస్తున్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. నడవలేని వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి, వికలాంగులకు సచివాలయ సిబ్బంది వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్‌ను అందజేశారు. మండలంలో పింఛన్ల పంపిణీ నూరుశాతం పూర్తయిందని ఎంపీడీవో శివపార్వతి తెలిపారు.



కంచికచర్లలో పింఛన్ పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

ఆర్వో వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నిష్పక్షపాతంగా, నిబంధనలకనుగుణంగా విధులను నిర్వహించాలని జగ్గయ్యపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీవీటీ, అకౌంటింగ్ టీముల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో వెంకటేశ్వర్లు సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎన్నికల సంఘం నిర్దేశించి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముందస్తు అనుమతి పొందితే ఆయా పార్టీలు నిర్వహించే కార్యక్రమాలను ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు పరిశీలించడంతోపాటు వీడియో చిత్రీకరించాలన్నారు. అనుమతులు లేకుండా వాహనాలు వినియోగించినా, కార్యక్రమాలను నిర్వహించినా వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల వారు నిర్వహించే రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారం, బహిరంగ సభల నిర్వహణ, వాహనాల వినియోగం, ఇతర ప్రచార సామాగ్రి ఖర్చులను ఎప్పటికప్పుడు మదింపు చేయాలన్నారు. ఆయా పార్టీల రోజువారీ నిర్వహణ వ్యయం వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. తగిన ఆధారాలు చూపని రూ.50 వేలు నుంచి రూ.10లక్షలలోపు నగదు పట్టుబడినట్లయితే ఆమొత్తాన్ని సబ్ ట్రెజరీలో జమచేయాలన్నారు. ఈమేరకు సమాచారాన్ని జిల్లా సీజర్ కమిటీకి విచారణ నిమిత్తం పంపాలని సూచించారు. సమావేశంలో పేట తహసీల్దార్, ఏఈఆర్వో శేషగిరి, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, పేట ఎంపీడీవో రమేష్‌బాబు, సీఐ జానకీరామ్, ఆయా బృందాల సభ్యులు పాల్గొన్నారు.



ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ తదితర బృందాలతో సమీక్షిస్తున్న ఆర్వో వెంకటేశ్వర్లు

142 మంది వలంటీర్ల రాజీనామా

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీలోని ఆయా వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 72 మంది వలంటీర్లు తమ విధులకు శనివారం రాజీనామా చేశారు. ఈమేరకు వారు తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు తమ ఫిర్యాదుల ద్వారా వలంటీర్ల వ్యవస్థను అడ్డుకోవడం బాధాకరమన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న తమపై టీడీపీ నాయకులు ఎన్నికల కమిషనకు ఫిర్యాదు చేయడంతో మనస్తాపం చెంది విధులకు రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. నాలుగేళ్లుగా తమకు తమకు ప్రజాసేవచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు, సహకరించిన ఆయా క్లస్టర్ల పరిధిలోని కుటుంబాల వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

వత్సవాయి మండలంలో..

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి) : మండలంలోని పెంట్యాలవారిపాలెం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో టీసీకేజే భరత్‌రాజ్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ఇప్పటివరకు విధులలో ఎటువంటి వివాదాలు తావులేకుండా పనిచేశామన్నారు. పార్టీ, కులం, మతం అంటూ బేధాలు లేకుండా అందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్న తమను కించపరచడం బాధకరమన్నారు. రాష్ట్రంలో వచ్చేనెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అవి ప్రతిఇంటికి ఎలా అందింది ప్రజలకు తెలియజేసేందుకే రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. రాజీనామాలు సమర్పించివారిలో తూనం ఉపేంద్ర, మండి తిరీష్, గోరింకల ప్రశాంతి, చిలపా నాగలక్ష్మి, మన్నేపల్లి నాగరాజు ఉన్నారు.



రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న జగ్గయ్యపేట పట్టణంలోని వలంటీర్లు

అనిగండ్లపాడులో..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న గౌరవవేతనంతో స్వచ్ఛందంగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్లపై అభాండాలు వేయడం, ఆరోపణలు చేస్తుండటంతో మనస్తాపం చెందిన వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన 30మంది వలంటీర్లు శనివారం తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి హలీమ్‌కు అందజేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల గ్రామసచివాలయం పరిధిలో పనిచేస్తున్న 11మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు వారు ఎంపిడీవో రమేష్‌బాబును శనివారం కలిసి రాజీనామాపత్రాలు అందజేశారు. అదేవిధంగా మండలంలోని తొర్రకుంటపాలెం, చిల్లకల్లు గ్రామానికి చెందిన మరో ఇద్దరు వలంటీర్లు కూడా రాజీనామా చేశారు.

మాగల్లులో 24 మంది రాజీనామా

నందిగామ: నందిగామ మండలం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని మాగల్లు గ్రామానికి చెందిన 24మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. ఈమేరకు తమ రాజీనామా పత్రాలను నందిగామ ఎంపీడీవో ఎం.విశ్వనాథ్‌కు శనివారం అందజేశారు. ఈసందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ జీతం కోసం కాకుండా ప్రజలకు సేవచేయాలనే తలంపుతో గౌరవవేతనానికే పనిచేస్తున్న తమను ప్రతిపక్షాలు దూషించడం బాధాకరమన్నారు. తమ వద్ద ఉన్న ఫోన్లను కూడా అధికారులకు అప్పగించి, సచివాలయానికి దూరంగా ఉంటున్న తమపై విమర్శలు చేయడం తగదన్నారు. వలంటీర్ వ్యవస్థను విమర్శించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను ఉంచుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సేవలందిస్తున్న వలంటీర్లపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు పింఛన్ అందుకునే వృద్ధులు పడిన ఆవేదన కనిపించలేదా? అని ప్రశ్నించారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన వెలిశిల కీర్తి కుమారి 2014వ సంవత్సరంలో విజయవాడ చిట్టినగర్‌కు చెందిన సంజయ్‌కుమార్‌ను కట్న కానుకలు ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వీరికి పాప పుట్టింది. అయితే పెళ్లి సమయంలో భర్త ప్రభుత్వ ఉద్యోగం అని చెప్పగా అతనికి ఎటువంటి ఉద్యోగం లేదు. పైగా ఆడపిల్ల పుట్టిందని, ఇచ్చిన కట్నం చాలదని, అదనపు కట్నం తీసుకరమ్మని భర్తతో పాటు మామ విజయ్‌కుమార్, అత్త వెరినీకమ్మ, ఆడపడుచు ప్రశాంతి, ఆమె భర్త అజయ్‌కుమార్ వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.